

కె. బాలగోపాల్

# పేరేచర్ల హత్యల ముందు, వెనుక...

**సీతారామాంజనేయులు అనే పోలీస్ ఆఫీసర్ ఉన్నాడు. ఈయన ఇప్పుడు ఎస్‌పి ర్యాంకు అధికారి. కొన్నేళ్ల కింద కరీంనగర్ జిల్లా గోదావరిఖని ఎఎస్‌పిగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అడుగుపెట్టాడు. కింది వాళ్లచేత హత్యలు చేయించకుండా చేజేతులా హత్యలు చేసే ఐపిఎస్ అధికారి అన్న పేరు అప్పట్లోనే పొందాడు.**

చంపడం తప్పుకాదనుకుంటే ఇది మెచ్చుకోదగ్గ గుణమే. 'చేతికి మట్టి అంటకునే' పనులు స్వయంగా చేపట్టే ఉన్నతాధికారులు ఎంతమంది ఉంటారని?

కానీ అతను పోలీస్ అధికారి. కిరాయి హంతకముఠా నేత కాదు. అతని చేతికి చట్టం తుపాకి, లాఠీ ఇచ్చింది హత్యలు చేయ డానికి కాదు, ప్రాణాలు తీయడానికి కాదు ఆయుధాలు ఇచ్చింది ప్రాణాలు తీయడానికి కాకపోతే కాపాడడానికా అని ఆశ్చర్యపోతారేమో. కానీ కాపాడడానికే ఇచ్చారని చట్టం చెప్తుంది. ఎవరి ప్రాణాలను తీసే అధికారం, లేక 'హక్కు' పోలీసులకు లేదు. ఒక ఆపద్ధర్మంగా మాత్రమే వారికి బలప్రయోగం చేసే అధికారం ఉంది. దానికి సవాలక్ష పరిమితులూ జాగ్రత్తలూ చట్టంలో ఉన్నాయి. ఆ పరిమితుల వల్ల ఆ అధికారం ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా ఉంటుందని చట్టం ఆశిస్తుంది. అయితే ఆ పరిమితులతో కూడిన బలప్రయోగ అధికారం పోలీసులకు ఉన్నట్టయితేనే సమాజంలో ఎవరి ప్రయోజనాల కోసం వారు హింసకు పాల్పడకుండా ఉంటారనీ అట్లయితేనే బలహీనులకు రక్షణ ఉంటుందనీ చట్టం భావిస్తుంది.

ఆధుని చట్టాల వెనక ఉన్న ఈ ఆలోచనను విమర్శించే అవ కాశం, దానిని పలురకాలుగా తెగనాడే అవకాశం లేకపోలేదు. రాడికల్ భావాలు గల సామాజిక తత్వవేత్తలు ఆ పని చేసారు. అయినప్పటికీ దానిని సక్రమంగా అనుసరించి అది నిర్దేశించే పరిమితులను పాటించినట్టయితే ప్రజల జీవితాలకు కొంత భద్రత ఉంటుందనేది వాస్తవం.

సీతారామాంజనేయులు లాంటి పోలీస్ ఆఫీసర్లను చూసినప్పుడు ఈ సత్యం అర్థం అవుతుంది. గోదావరి ఖనిలో నక్సలైట్లను స్వయంగా హతమార్చి 'ఎన్‌కౌంటర్'లు ప్రకటించిన ఈ మహానుభావుడు ఆ తరువాత ఇంకొంత కాలం తెలంగాణ జిల్లాలలోనే నక్సలైట్లను ఏరివేసే 'స్పెషల్' పదవులు వెలగబెట్టి, కర్నూలుకు ఎస్‌పిగా పోయాడు.

హత్యలు చేసేవాళ్లను చట్టంతోనూ కోర్టు విచారణతోనూ నిమిత్తం లేకుండా హతమార్చడమే తన విధ్యుక్త ధర్మంగా అతను భావించి ఉన్నట్టయితే కర్నూలు జిల్లాలో ఫాక్షనిస్టులను ఒక్కొక్కరినీ చంపి ఉండవలసింది. బైరెడ్డి రాజశేఖర రెడ్డి, చల్లా రామకృష్ణా రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి నుండి 'పెద్దాయన' కోట్ల విజయభాస్కర రెడ్డి దాకా ఈ జాబితాలోకి వచ్చి ఉందురు.

కానీ హత్యలు చేసేవాళ్లను చట్టంతో నిమిత్తం లేకుండా చంపడం పోలీసుల డ్యూటీయేననుకునే సీతారామాంజనేయులు వంటి పోలీస్ అధికార్లకు ఆ తప్పుడు ఆలోచనలో సహితం నిజాయితీ లేదు. కర్నూలు జిల్లాలో సీతారామాంజనేయులు రాజ్యం చేసిన రోజులలో ఫాక్షనిస్టులొక్కరినీ చంపలేదు. వాళ్ల కాల్పంలో ఉంటూ

వాళ్ల పురమాయింపు మీద హత్యలు చేసే 'కిరాయి హంతకులు' అని పిలువబడే వాళ్లను మాత్రమే చంపాడు.

హోదాలో కింది వాళ్లు కులంలో కూడా కింది వాళ్లు కాకతప్పదు కదా. కర్నూలులో వారి రాజ్యంలో చనిపోయిన 'కిరాయిహంతకుల' లో ఒక్కడు మాత్రమే రెడ్డి. అతను కోవెలకుంట్ల తాలూకాకు చెందిన అశ్వత్థరెడ్డి. ఈ ఒక్కడూ ఒక ఎరుకలామెను పెండ్లి చేసు కొని కులానికి దూరం అయ్యాడు! తక్కిన వాళ్లంతా ఎరుకల, బోయ, వడ్డెర, బలిజ మొదలయిన కులాలకు చెందినవారు.

ఇప్పుడు సీతారామాంజనేయులు గుంటూరుకు పోయి అదేపని అక్కడా కొనసాగిస్తున్నాడు. ఏ కోడెల శివప్రసాదరావునూ ఆయన ఏ రోజా ఏమీ చేయడనీ చేయజాలడనీ హామీ ఇయ్యవచ్చును. కానీ డెకాయిటీ కేసు ముద్దాయిలను జైలు నుండీ కోర్టుకు తీసుకు పోతూ 'జ్యుడీషియల్ కస్టడీ' లోనే కాల్చి చంపగలడు. పేరేచెర్ల దగ్గర నలుగురిని కాల్చి చంపాడు. అతనినొక గొప్ప కార్యదక్షుడిగా భావించే వాళ్లు గుంటూరులోనూ బయటా కూడ ఉంటారు. అతన్ని మనం హంతకుడంటే మనమీద పడి కరుస్తారు కూడ. కానీ అదే జిల్లాలో అనేక రాజకీయస్కాం లలోనూ, ఫైనాన్స్ స్కాంలలోనో గొంతుదాకా కూరుకుపోయిన వారెవ్వరూ ప్రాణం పోతుందని కాదు సరికదా, చట్టానికి దొరుకుతారని కూడ భయపడడం లేదంటే ఈ మహాను భావుడి కార్యదక్షతను ఏ విధంగా అర్థం చేసుకోవాలని వారెవ్వరూ ఆలోచించరు.

> హత్యలు చేసేవాళ్లను చట్టంతోనూ కోర్టు విచారణతోనూ నిమిత్తం లేకుండా హతమార్చడమే తన విధ్యుక్త ధర్మంగా అతను భావించి ఉన్నట్టయితే కర్నూలు జిల్లాలో ఫాక్షనిస్టులను ఒక్కొక్కరినీ చంపి ఉండవలసింది. భైరెడ్డి రాజశేఖర రెడ్డి, చల్లా రామకృష్ణా రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి నుండి 'పెద్దాయన' కోట్ల విజయభాస్కర రెడ్డి దాకా ఈ జాబితాలోకి వచ్చి ఉందురు.

ఇది సీతారామాంజనేయులుకూ అతను ఏలుతున్న జిల్లాలకూ పరిమితమైన విషయం కాదు. పక్కనే ఉన్న విజయవాడ పోలీస్ కమీషనర్ సురేంద్రబాబు అతనికి సీనియరే. తెలంగాణా జిల్లాలలో- వరంగల్ ఎ.ఎస్.పిగా ప్రారంభించి- హత్యాకాండ మొదలు పెట్టాడు. బయటి జిల్లాలకొచ్చి 'కరడుగట్టిన నేరస్తులను' చంపడం కొనసాగిం చాడు. ఇప్పుడు విజయవాడ పోలీస్ కమిషనర్ గా రిమాండ్ ఖైదీ పిల్లి ప్రసాద్ ను కాల్చి చంపాడు. జైలులో ఉన్నవాడిని 'ఇంటరాగేషన్'కని తీసుకొచ్చి కాల్చి చంపాడు.

జైలు నుండి కోర్టుకు తీసుకుపోతూ దారిలో కాల్చి చంపినా, జైలు నుండీ కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీలోకి తీసుకొని వచ్చి కాల్చి చంపినా 'కోర్టు వారికి' కోపం వస్తుందని వీళ్లకు భయంలేదా అంటే ఎంతమాత్రం లేదని చెప్పాలి. దానికి వాళ్లను తప్పుపట్టడం కంటే కోర్టులను తప్పు పట్టడం ఉచితంగా ఉంటుంది. తాము జారీ చేసిన ఆర్డర్లు లేక వారంట్ల ఫలితంగా పోలీసుల కస్టడీలోకి పోయిన వారిని పోలీసులు కాల్చి చంపుతుంటే మన న్యాయవ్యవస్థ చలించడంలేదు. చలించదని సీతారామాంజనేయులుకూ, సురేంద్రబాబుకూ తెలుసును కాబట్టే నిర్భయంగా చంపుతున్నారు.

వాళ్ల చేతిలో చనిపోతున్నవాళ్లు మంచివాళ్లుకాకపోవచ్చు. మంచివాళ్లు కాకపోవడమేమిటి, పరమ దుర్మార్గులు కావచ్చును కూడా. దుర్మార్గులయినప్పుడు రెడ్లయితేనేం, ఎరుకలవాళ్లయితేనేం, అని అగేవాళ్లు ఉంటారు. ఎవరయితేనేం అన్నప్పుడు ఎరుకలవాళ్లే ఎందుకు చావాలని ఎదురు ప్రశ్న వేయవచ్చు ననుకొండి- కానీ అంతకంటే లోతయిన ప్రశ్నే వేయవచ్చును.

మన సమాజాన్నీ సామాజిక లక్ష్యాలనూ మనం నిర్వచించు కునే విధమే వేగంగా మారిపోతున్నది. 'లా అండ్ ఆర్డర్'ను కచ్చితంగా నిలబెట్టాలని ఇప్పుడందరూ ఎంత గంభీరంగా అంటున్నారో అంతే వట్టుదలగా దానిని చిన్నజనం చేసే నేరాలకే పరిమితం చేసి నిర్వచిస్తున్నారు. ఆ నేరాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలి. వాడికి చట్టం చట్టబద్ధ పాలన, న్యాయబద్ధమైన నేరవిచారణ మొదలయినవి వర్తించాలనడం చాదస్తం. చిన్నజనం ఏ పరిస్థితులలో నేరస్తులవుతున్నారు, అసలు 'నేరం' అనే మాటకు గల అర్థం ఏమిటి మొదలయిన సున్నితమైన ప్రశ్నలపట్ల ఎవరికీ ఇప్పుడు సదభిప్రాయంలేదు. కానీ అటువైపు బలవంతుల విలాసాలు,విన్యాసాలు ఒకవేళ చట్టాన్ని అతి క్రమించినా అదేమంత విశేషం కాదు. వాళ్లు బాగా ఉండి ఆత్మ నిబ్బరంతో తమ వ్యవహారాలు నిర్వహించుకోగలిగినట్టయి తేనే ఈ దేశం పరోగమిస్తుంది. ఎందుకంటే వాళ్ల పురోగతే దేశంపురోగతి కాబట్టి. నిజానికి వాళ్ల పురోగతికి అడ్డమొస్తుందనే, చిన్నజనం సృష్టించే 'శాంతి భద్రతల' సమస్యలను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలి.

అందుకే సీతారామాంజనేయులు, సురేంద్రబాబు వంటి పోలీస్ అధికార్ల చేతిలో తూటాలకు బలవుతున్నవారు ప్రజలు చీదరించుకునే దుర్మార్గులయినప్పుడు, పోలీసుల ప్రవర్తన చట్టబద్ధమా కాదా అన్న చర్చ ఎందుకు, చచ్చిపోతున్న వారి కులాన్ని చూడడం ఎందుకు అన్న వైఖరి పొరబాటు వైఖరి.